

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## హృదయంలేని మనిషి

**అనంత్ సాయంత్రం** ఇంటికి వచ్చేసరికి సుజాత కళ్ళు ఎర్రబడి, ముక్కు ఎగబీల్చుకుంటూ ఉంది.

"ఏమైంది సుజీ ఎందుకలా ఏడుస్తున్నావ్?" బిత్తరపోయి అడిగాడు.

"ఇవాళ టివి చూసావా?" నిలదీసింది.

"మా ఆఫీస్‌లో టివిలు ఉండవు. ఏమైంది? కొంపదీసి నీ అభిమాన నటుడేమైనా?" అర్థోక్తిగా ఆగిపోయాడు.

"ఛీ! నోటికి మంచిమాటలు రావా? ఇవాళ స్కూల్ పిల్లల బస్‌ని రైలు గుద్దేసింది. చాలామంది పసికందులు.." సుజాత మళ్ళీ ఏడవసాగింది.

"ఓ! ఆ ఇన్సిడెంటా? విన్నాను. పాపం. పేరెంట్స్‌కి ఎంత బాధో" అనంత్ ఒప్పుకున్నాడు.

"హృదయంలేని మనిషివి. వాళ్ళకోసం ఒక్క కన్నీటి బొట్టయినా రాల్చావా?" ఉగ్రంగా అడిగింది.

"అయ్యో అనుకున్నాను. ఏడుపు రాలేదు." నిజాయితీగా చెప్పాడు.

"నీలాంటి రాతి మనిషిని కట్టుకున్నందుకు నామీద నాకే కోపంగా ఉంది" చెప్పి లోపలకి వెళ్ళిపోయి తలుపు ధడాలున వేసుకుంది.

ఈ రోజుకి తనకి భోజనం లేదని గ్రహించిన అనంత్ భుజాలెగరేసి బయటకి నడిచాడు.

సుజాతది చిన్నప్పటినించి జాలిగుండె. పేపర్లో ఏ చావు వార్త చూసినా వెక్కిళ్ళు పెట్టి ఏడ్చేది. కుక్కమీద రాళ్ళేసేవాళ్ళని, పక్షులని ఎగరకొట్టే వాళ్ళని తిట్టి జీవహింస గురించి బోధించేది. "ఇంట్లో వాళ్ళమ్మ పనులతో సతమతమౌతూంటే, ఇటుపుల్ల తీసి అటు పెట్టదు. బయటివాళ్ళ కష్టాలకి మాత్రం ఏడుస్తుందిట. మొసలి కన్నీరూ ఇదీనూ." వాళ్ళ నాయనమ్మ మెటికలు విరుస్తూ సణుక్కునేది.

పైకి అనే ధైర్యం లేదావిడకి. వింటే మనవరాలు పెద్దంతరం చిన్నంతరంలేకుండా తనమీద అరుస్తుందని భయం.

ఈ గోల భరించలేక ఫ్రెండ్స్ ఆమెకి అంజలీదేవి అని ముద్దుపేరు పెట్టారు. 'దీన్ని ఎవడు చేసుకుంటాడోకాని చచ్చాడే' అనుకునేవారు. పెళ్ళయ్యాక ఈ ధోరణి కొద్దిగా తగ్గినా పూర్తిగా పోలేదు. గత్యంతరం లేని అనంత్ అడ్జస్ట్ అయిపోయాడు.

"అక్కా ఏం చేస్తున్నావు?" గోడమీంచి కళ్యాణి పిలిచింది.

"మా అమ్మని చూడాలనిపించి వెళ్తున్నా కళ్యాణి. బట్టలు సర్దుకుంటున్నా" సుజాత ఇటువైపు నించి సమాధానం ఇచ్చింది.

"ఎన్ని రోజులక్కా? నువ్వు లేకపోతే నాకసలు తోచదు" కళ్యాణి దిగులుగా చెప్పింది.

"వారంలో వచ్చేస్తాను. పనైపోతేరా" సుజాత ఆహ్వానించింది.

కళ్యాణి వాళ్ళింటి గేట్ తీసుకుని పక్కింట్లోకి వచ్చింది. ఆమెతో వచ్చిన పాపని చూసి సుజాత ముచ్చటగా చెప్పింది.

"ఏ సమయంలో చూసినా నీ కూతురెంత ఫ్రెష్‌గా ఉంటుందో పువ్వులాగా. మా సుమంతూ ఉన్నాడు. పొద్దున స్నానం చేయించి బట్టలు వేస్తానా? మధ్యాహ్నానికల్లా మురికి చేసేసుకుంటాడు. ఎంతైనా ఆడపిల్లల పొందిక మగపిల్లలకి రాదు."

నీలోత్పల సుజాత చెయ్యిపట్టుకుని ఫ్రిజ్ వైపు చూపించింది. సుజాత నవ్వి ఫ్రిజ్‌లోంచి చాక్లెట్స్ తీసి నీల చేతిలో రెండు పెట్టి రెండు కొడుక్కిచ్చి చెప్పింది.

"అల్లరి చేయకుండా ఆడుకోండి."

"అక్కా బావగారికి కూరలు వండిస్తే అన్నం ఒక్కటి వండుకుంటారా?" కళ్యాణి అడిగింది.

"ఏమక్కర్లేదు. కేంటిన్‌లో తింటాడు. రమేష్‌కి నాలుగు రకాలు చేసి నువ్వు అలసిపోతున్నావు. ఈ బర్డెన్ కూడా ఎందుకు?" సుజాత ఒప్పుకోలేదు.

సుజాత ఊరినించి వచ్చాక ఆ వార్త తెలిసి తల్లడిల్లిపోయింది. వానొస్తోందని, పైన ఆరేసిన బట్టలు తేవడానికి పరిగెత్తిన కళ్యాణి మెట్లమీద కాలు జారిపడి హాస్పిటల్‌కి తీసుకెళ్ళేలోగానే కన్నుమూసింది.

ఆ సాయంత్రం అనంత్ ఇంటికి రాగానే అతని కాలర్ పట్టుకుని అరిచింది.

"రోజూ పొద్దున, సాయంత్రం ఫోన్లు చేస్తూనే వున్నావుగా? కళ్యాణి విషయం చెప్పలేదే?"

"పుట్టింట్లో సరదాగా ఉందామని వెళ్ళావు. ఈ సంగతి చెప్పి నిన్ను ఏడిపించడం ఎందుకని. ఆ అమ్మాయి హాస్పిటల్‌లో ఉండుంటే తప్పకుండా చెప్పేవాడిని" అనంత్ నిజాయితీగా చెప్పాడు.

"నువ్వెంత హృదయంలేని మనిషివి? మనుషుల ప్రాణాలంటే నీకసలు విలువలేదు" సుజాత భోరున ఏడ్చింది.

"అత్తా!" నీల పిలుపు విని ఆ పాప వైపు చూసిన సుజాత ఉలిక్కిపడింది. అట్టలు కట్టిన జుట్టు, మాసిపోయిన ఫ్రాక్, స్నానం చేసి ఎంతోకాలమైందన్నట్లుగా వాసన వేస్తోంది.

"అత్తా. అన్నం" నీల దీనంగా అడిగింది.

సుజాత కళ్ళవెంట బోటబొటా నీళ్ళు కారాయి. రమేష్ రెండో పెళ్ళి చేసుకున్న అమ్మాయి నీలని కొట్టదు, తిట్టదు. అసలు పట్టించుకోదు. ఆమెని తిట్టుకుంటూ నీలని బాత్రూంలోకి తీసుకెళ్ళి స్నానం చేయించి సుమంత్ టి షర్ట్ వేసింది.

"అత్తా! అన్నం" ఆ పిల్ల మళ్ళీ అడిగింది.

అన్నం తిన్నాక నీల చిన్నగా నవ్వింది.

"నవ్వినప్పుడు నీ మొహం ఎంత వెలిగిపోతుంది నీలా. చిట్టి ముత్యంలా ఉన్నావు" ఆ పాపని గాఢంగా కౌగలించుకుని ముద్దుపెట్టుకుంది.

"అసలు ఆ రమేష్ మనిషేనా? పెళ్ళాం పోయిన నాలుగునెలలకే మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడా?" ఆ రాత్రి అనంత్‌ని నిగ్గదీసింది.

"ఇది మరో బావుంది. ఎవరో చేసిన తప్పులకి కూడా తిట్టడం మొదలు పెట్టావా? ఐనా రమేష్ వయసెంత? ఇరవై తొమ్మిది. అతనికీ ఎన్నో కోరికలు ఉంటాయి. ఎంతకాలం ఆగి పెళ్ళిచేసుకుంటే మంచిదంటావు? అసలే భోజన ప్రియుడు. ఆ భార్య నీలని చూడలేదంటే అది మాత్రం రమేష్ తప్పే. ముందే ఆ విషయం మాట్లాడాల్సింది" అనంత్ చెప్పాడు.

"హృదయంలేని మనిషి. నాలుగునెలల్లో కళ్యాణిని మర్చిపోయాడు" సుజాత ఆవేదనగా చెప్పింది.

చూడు. నీకు అంత బాధగా ఉంటే, మనవాడితోపాటు నీలని కూడా పెంచు. దాని చిన్నపొట్టకి ఎంత కావాలి? ఇతరుల నిర్ణయాలని విమర్శించడానికి మనం ఎవరం? వాళ్ళ మనసుల్లో ఏముందో మనకేం తెలుసు?" అనంత్ అనునయంగా చెప్పాడు.

ఆ తర్వాత వారంలోనే నీల అమ్మమ్మ, తాతయ్య వచ్చి నీలని తమతో తీసుకెళ్ళారు. ఐతే అనంత్ ఆశించినట్లుగా సుజాత నీల అమ్మా నాన్నలకి కాకుండా ఎవరింట్లోనో పెరుగుతుందని శోకించలేదు. రమేష్ వేరే ఊరికి బదిలీ చేయించుకుని వెళ్ళిపోయాడు.

నలభైల్లోకి వచ్చాక సుజాత ఏడుపు చాలావరకు తగ్గింది. అమెరికానించి సుమంత్ ఫోన్ చేసినప్పుడు మాత్రమే ఆమె ముక్కు ఎర్రబడుతోంది.

ఆరోజు అనంత్ మధ్యాహ్నమే ఇంటికి వచ్చేసాడు. అతను దిగులుగా ఉండటం గమనించిన సుజాత ఆతృతగా అడిగింది.

"ఈ టైంకి వచ్చావేంటి? మొహం వాడిపోయింది. ఏమైంది?"

"మా మహీగాడు పోయాట్ట."

"ఛ! నిండా ఏభై లేవు."

“వాళ్ళావిడ పుట్టింటికి వెళ్ళిందిట.. ఏ అర్ధరాత్రో హార్ట్ అటాక్ వచ్చిందనుకుంటా. నిద్రలోనే పోయాడు.”

"అయ్యో ఇంట్లో ఎవరైనా ఉంటే సమయానికి హాస్పిటల్‌కి తీసుకెళ్ళేవారు. వాళ్ళావిడ ఎంత హృదయంలేని మనిషి? ఒక్కడ్నే వదిలి వెళ్తుందా? ఇప్పుడు నష్టం ఎవరికి?" సుజాత కోపంగా అడిగింది.

"నువ్వొ నన్ను వదిలి ఎన్నిసార్లు వెళ్ళలేదు?" అడుగుదామనికుని తర్వాత దండయాత్రని తట్టుకోలేననుకుని ఊరుకున్నాడు.

"నువ్వు ఏడవడంలేదే?" కొద్దిసేపాగి అడిగాడు.

"ఎందుకు?"

"పేపర్లో చావు వార్తలని చూస్తేనే ఏడుస్తావుగా? వీడు నా బెస్ట్ ఫ్రెండ్. మనం వందలసార్లు కలిసాం. నువ్వెంత దుఃఖపడతావోనని భయపడ్డాను."

"నాకు ఏడుపు రావడంలేదు. వాళ్ళావిడ మీద కోపంగా ఉంది" సుజాత చెప్పింది.

"నాన్నా! మీ రాత్రి ఏడున్నరకి వీడియోకాల్ చేస్తాను. అమ్మ పక్కన నువ్వుకూడా ఉండు ప్లీజ్. సుమంత్ నించి టెక్స్ట్ మెసేజ్ వచ్చింది.

అతనేం చెప్పబోతున్నాడో అనంత్ ఊహించగలిగాడు.

ఏడున్నరకి సుమంత్ ఫోన్ చేసాడు.

"అమ్మా! నేనిక్కడ ఓ అమ్మాయిని ఇష్టపడుతున్నాను. తనకి చెప్పలేదు. నువ్వు సరేనంటేనే" భయపడుతూ చెప్పాడు.

వెంటనే సుజాత మొహం వివర్ణమైంది.

"ఎవరు? ఏ దేశం పిల్ల?" కటువుగా అడిగింది.

"తెలుగమ్మయేనమ్మా. పేరు నీలోత్పల. చిన్నప్పుడే వాళ్ళమ్మ పోతే, తాతయ్య, మేనమామలు పెంచారట. ఫాదర్‌తో సంబంధాలు లేవుట. చాలా కష్టపడి యు.ఎస్ వచ్చిందమ్మ. తను నాకు చాలా నచ్చింది. ఏమంటావు?" సుమంత్ ఆశగా అడుగుతూ ఆ అమ్మాయి ఫోటో పంపాడు.

అచ్చం కళ్యాణిలా ఉన్న నీల పసుపు రంగు డ్రెస్‌లో నవ్వుతోంది.

"అరె!..." ఏదో అనబోతున్న అనంత్ చెయ్యి నొక్కి సుజాత చెప్పింది.

"రేపు ఈ టైంకి మాట్లాడుకుందాం" లైన్ కట్ చేసింది.

"ఎంత ఆశ్చర్యం సుజీ. మన నీల మళ్ళీ మనింటికి కోడలుగా వస్తోంది." అనంత్ సంబరంగా చెప్పాడు.

"నీకు ఈ పెళ్ళి ఇష్టంలేదని రేపు వాడికి చెప్పు" సుజాత చెప్పింది.

"అదేంటి? కళ్యాణి అంటే నీకిష్టమేగా?" అనంత్ అయోమయంగా అడిగాడు.

"చెప్తవా లేదా?" సుజాత రెట్టించింది.

"చెప్పను. మధ్యలో నా పేరెందుకు చెప్తావు? నీకే ఇష్టం లేదని ధైర్యంగా చెప్పచ్చుగా? కొడుకు నొచ్చుకుంటాడని భయం. నన్ను అపార్థం చేసుకున్నా ఫర్లేదు. అంతేగా? లోకంలోఎవరో చస్తే ఏడ్చే నీది జాలిగుండె అనుకున్నా కాని రాతి బండ. నీలతో పెళ్ళి నాకిష్టమే అని ఇప్పుడే వాడికి చెప్తున్నా. లేదా నువ్వు నా పేరుతో అబద్ధాలు చెప్తావు." అనంత్ ఆవేశంగా అరిచాడు.

"ఎంత హృదయం లేని మనిషివి? అనాధ పిల్లని చేసుకుంటే మనవాడికి అత్తగారిల్లు, అండదండలు ఏముంటాయి? వాడి సంగతి కొంచెమైనా ఆలోచించావా నువ్వు?" సుజాత చాలా రోజుల తర్వాత వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె కళ్ళూ, ముక్కూ ఎర్రబడిపోయి శోకదేవతలా ఉన్నా కూడా ఈసారి అనంత్ పట్టించుకోలేదు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments